ఒకప్పటి మరదలు

శ్రీమతి రాధారాఘవ్

టిఫిను పళ్ళెం బల్లమీద పెడుతూ, 'ఎక్కడి నుంచా శుభలేఖ?' అనడిగింది వాసంతి.

'మా మామయ్య దగ్గర్నుంచి. వాళ్ళ మ్మాయికి పెళ్ళి నిశ్చయించేశారట' లన్నాడు ప్రభాకరం.

—'అన్నట్టు నువ్వు మామయ్యగారి లేఖను చూడలేదు గదూ? బతే చిరిపి పిల్లనే. చాలా అల్లరి చేస్తుంది. మన పెళ్ళికి రాలేకపోయింది పాపం. అప్పుడు వాళ్ళకి బి. ఎస్. సి. గాబోలు ఫైనల్ ఎగ్జామినేషన్సు అవుతున్నాయి. 'నేను పి

పెళ్లికి రాలేదని; నువ్వూ మానేవు నుమా; తప్పకుండా రావాలి. నువ్వు రాకపోతే అసలు నేను పెళ్లిపీటల మీదే కూర్చోను' అంటూ ఉత్తరం వ్రాసింది. ఇదిగో చూడు అంటూ ఉత్తరాన్నిచ్చాడు.

వాసంతి ఉత్తరాన్ని చదువుతూంటే ప్రభాకరం హుషారుగా యీలా వేస్తూ, అద్దం ముందు నిలబడి తల దువ్వుకోవడం మొదలు పెట్టాడు.

ఉత్తరం చదవడం అయాక, తిరిగి దానిని భర్తకిచ్చేస్తూ, నవ్వుతూ అంది వాసంతి. 'తీరుచూస్తే గడుసుపిల్లలానే ఉందే.'

'ఆఁ మరేమిటనుకున్నావ్. ఎవడోస్తున్నాడోగాని చెవులట్టుకు ఆడిస్తుంది. ఎమ్. ఎస్. సి. డిగ్రీ తీసుకునేదాకా పెళ్లి చేసుకోనని, ఫారిన్ రిటర్నర్నేగాని మరోడిని వివాహమాడనని డబ్బాలు కొట్టేది. మొత్తానికి రెండూ సాధించింది. నువ్వూ చూద్దుగాని పదిరోజులు శలవుపెట్టి వెళ్దాం ఏమంటావ్?'

'దానికేం. తప్పకుండా వెళ్దాం. నాకూ ఆ అమ్మాయిని చూడాలని కుతూహలంగానే ఉంది. తరచూ ఆ అమ్మాయి గురించి మీ నోటంట వింటూంటానుగా.'

'ఓ. కే! రేపే లీవ్‌కి అప్లయి చేసేస్తాను'

'చిన్న రిక్వెస్ట్.'

'చెప్పొచ్చు...చీరలు కావాలా? నగలు కావాలా? నాణ్యాలా?...'

'అవేం ఒద్దుగాని నాకు, ఎటూ అంత దూరం ఎలాగా వెళ్తున్నాం కాబట్టి కొంచెం ఎక్కువ రోజులు శలవు పెట్టండి, ఏకంగా మా వాళ్లింటికే వెళ్లొద్దాం. ఏమంటారు?'

'అంగీకరించాం.'

'ఏం ఫోజుగాని, అయితే రేపే ఉత్తరం వ్రాసేస్తాను మా యింటికి. పండుగ అందరం సరదాగా కలిసి చేసుకోవచ్చు. మా అక్కయ్యలను కూడ రమ్మని వ్రాసేస్తాను. పెళ్లయాక కలిసి, అందరం ఒక్కసారీ ఉండలేదు.'

'ఆగాగు. అప్పుడే అంతదూరం వెళ్లిపోకు. ఇంకా లీవ్ దొరికినప్పటి మాటగా. అప్పుడు వ్రాద్దుగానిలే. అయినా యింటికి వెళ్తే; రాణిగార్కి; అక్కలూ బావలూ

బావా-మరదలూ

మధ్య నేను గుర్తుంటానా? అందులోనూ అందరికీ చిన్నారి మరదలివి-గాబోలు నువ్వు. నన్నొక్కడ్నీ వదిలేసి, తమరు పెత్తనాలకి చెక్కేస్తుంటే, ఆ గదిలో ముక్కూ, మొహం సరిగ్గా ఎరగని మనుష్యుల మధ్య బిక్కుబిక్కుమంటూ ఒక్కడ్నే పడుండాలి. ఎందుకొచ్చింది బాబూ. నేను రాను. నువ్వొక్కదానివీ వెళ్లు.'

'గొప్ప సలహాయె... అంతగా గిరిగీసుకు ఒక్కరూ కూర్చోపోతే నలుగురితో చనువుగా కలిసిపోయి మీరూ తిరిగేయండి. అప్పుడు క్రొత్త వదిలిపోయి, అందరూ పాతయి పోతారు. రేపు మీ మామయ్య గారింట్లో పెళ్లిలో నేను అందరితో కలిసిపోనూ? నాకు మాత్రం వాళ్లంతా సరిగ్గా తెలుసా, ఏమిటి? మీరూ అలాగే కలిసిపోవాలి. అదీగాక నేనే పెత్తనాలకు పోతే మాత్రమేం? తమర్నెప్పుడూ నా హృదయ పీఠంలో పెట్టుకునే తిరుగుతానుగా. కనుక ఏ దిగులూ పెట్టుకోకండి.'

అబ్బ తలుచుకుంటూంటే ఎప్పుడు యింటికి వెళ్లిపోదామా అనిపిస్తోందండీ. ఇన్ని పండుగలు చేసుకున్నాంగాని, మా యింటి దగ్గరున్నంత నిండు ఒక్క పండుక్కీ రాలేదు. ఏ పండుగొచ్చినా మా యిల్లు పెళ్లివారిల్లులా ఉంటుంది. అక్కల పరిహాసాలూ, వదినల వేళాకోళాలూ, బావల్ని ఏడిపించడాలూ ఎంత సందడి! ఎంత హడావుడి! నలుగురున్న కుటుంబమే మో, ఎంత సరదాగా ఉంటుందో చెప్పలేను.

ఇంక మా శేఖరం బావ ఉంటే చెప్పనే అక్కర్లేదు. ఈ బావకు జోడీ మా చిన్నన్నయ్య, వీళ్లిద్దరూ తలుచుకున్నారూ అంటే చాలు. సినిమాకి నాన్నగార్ని ఒప్పించి, నిద్రలో వున్నవాళ్లను సైతం లేపి క్షణంలో యింటిల్లిపాదినీ కదిలించేవారు. అత్తయ్యా! ఆ సినిమాలో హీరో ద్వార్‌లో గుడులు చూపిస్తున్నారట అంటే చాలు; మా అమ్మా లేచి కూర్చునేది— అయితే నేనూ వస్తా పదండంటూ. ఆనక తిరిగొచ్చాక, సినిమాలో గుడులు చూపించకపోడానికి కారణం ఏదో కల్పించేవారనుకోండి. తను చలాకీగా ఉండడం కాక, అందర్నీకూడ హుషారుగా ఉంచేవాడు.

అందులోనూ మేనరికమేమో; చిన్నప్పట్నుంచీ అనుకున్న సంబంధం, మొదట్నుంచీఉన్న చనువు కావడాన — అల్లుడంటే దశమగ్రహం అంటారే, అలాంటి బాధలేవీ యింతవరకూ అనుభవంలోకి రాలేదు మా వాళ్లకు. నిజం చెప్పాలంటే మా బావలిద్దరూ మంచివాళ్లే. మా నాన్నగారూ, అమ్మా నొచ్చుకునేలా యేనాడూ ప్రవర్తించలేదు.

ఇంక మా భాస్కరం బావ ఎలాంటి వాడంటే తను నవ్వుతూ, అందర్నీ నవ్విస్తూ కులాసాగా గడిపేస్తూంటాడెప్పుడూ. ఆ రోజుల్లో మా బావ వచ్చినప్పుడు, ఆ నాలుగురోజులూ నాలుగు క్షణాల్లా గడిచిపోయేవి.

ఒకసారేమైందంటే, మా నీరజక్క పెళ్లయిన కొత్తది. దసరాపండక్కి బావొచ్చాడు. పండగనాడు మీద వసంతం పోయమని యింట్లో అందరూ నన్ను ప్రోత్సహించారు తెల్లటి బట్టలేసుకుని, నీటుగా ముస్తాబయి, బయటికెళ్లడానికి తయారయి ఉన్నాడు మా బావ. గవ్‌చివ్‌గా వెళ్లి మీద పోసేశాను వెనుకనుంచి. వెంటనే బావ చటుక్కున నన్ను పట్టుకుని, అక్కడే డ్రెస్సింగ్ టేబిలుమీదున్న కాటుకా కుంకం తీసి ముఖమంతా పులిమేశాడు ..'

'అబ్బబ్బ మీ బావల ముచ్చట్లు చాలుగాని. తల బద్దలవుతోంది; కొంచెం కాఫీ తగలేస్తావా?'

చిన్ననాటి మధురస్మృతులను కలబోసుకుంటున్న వాసంతి భర్త కటుస్వరానికి విసుగుపోయింది. కళకళలాడుతోన్న ఆమె ముఖం కళాహీనమైపోయింది.

సిగరెట్టు పీలుస్తూ, గదిలో విసురుగా పచార్లు చేస్తున్నాడు ప్రభాకరం. పెట్టిన టిఫిను పెట్టినట్టే ఉంది. అంతవరకూ రేఖ గురించి, ఆ అమ్మాయి పెళ్లి ముచ్చట్ల గురించి, పెట్టబోయే శలవు గురించి, హుషారుగా ఆలోచనలు సాగిస్తూన్న అతని ముఖం ఎర్రబడిపోయి ఉంది.

అతని తీవ్రత చూసేసరికి భయం కల్గింది వాసంతికి. ముఖం చిన్నబుచ్చుకుని, చటుక్కున లేచి వంటింట్లో కెళ్లిపోయింది.

* * *

మిట్టమధ్యాహ్నం వేళ. ఏదీ కాని

ఇష్టమయిన భోజనాలయ్యాగానే, ప్రభాకరం కాఫీ కావాలంటే చేసి, తీసుకెళ్తోంది వాసంతి. పండగ భోజనాలు పూర్తయే సరికి చాలా ఎండెక్కిపోయింది. అంత క్రితమే వంటింటి పనులు ముగించుకుని నడుం వాల్చింది కామేశ్వరమ్మగారు.

పండక్కి పట్టింటికొచ్చిందన్నమాటే గాని, నలుగురూ కలిశారన్న సంతోషం లేకుండా పోయింది వాసంతికి.

ఎంచేతో యిక్కడికొచ్చినప్పట్నుంచీ ప్రభాకరం ముభావంగానే ఉంటున్నాడు. అడిగిందానికి సమాధానం చెప్పడం, ఏదైనా వేళాకోళం చేసినా సీరియస్‌గా చూడ్డం, ఏదీ పెట్టినా ఒద్దంటూ సరిగ్గా తినక పోవడం — అతనిదగ్గర నిలబడ్డానికే భయంగా ఉంటోంది వాసంతికి.

పండుగ ఎంతో సరదాగా గడపాలనీ, ఒకరోజు పిక్నిక్‌కనీ, మరో రోజు సినిమా కనీ ఇలా ప్రోగ్రాంలు పెట్టుకుని ఉల్లాసంగా గడపాలనీ, ఎన్నెన్ని ఊహించుకుంది.

భర్త ప్రక్కగా తను వెళ్తూంటే, నలుగురిలో తమ జంట, అందరికంటే అధిక్యంగా కనిపించాలనీ, 'వాసంతీ! వాసంతీ!' అంటూ ఆప్యాయంగా అతను తనను పలకరిస్తూ తిరుగుతూంటే, తమ అన్యోన్యతను చూసి, ప్రేమురైన తల్లిదండ్రులు మురిసిపోవాలనీ, నలుగురితో చనువుగా కలిసిపోయి తిరుగుతోన్న అతన్ని చూసి, 'ఎంతో కలుపుగోలుమనిషి, గర్వం ఏమీలేదు' అని అందరూ చెప్పుకోవాలనీ, బావలూ, ఆయనా ఏ మైత్రి తనను ఉడికిస్తూంటే, అక్కలను వెనకేసుకు తను దెబ్బలాడాలనీ ఎన్నో అనుకుంది.

కాని భర్తముభావంతో అన్నీ తల క్రిందులయి పోయాయి. ఉత్సాహమంతా పొంగుతోన్న పాలమీద నీళ్లు చిలకరించినట్టు అణిగిపోయింది. పుట్టింటి కొచ్చానన్న సంతోషం ఆమెలో కాగడా పెట్టి వెదికినా కనిపించడంలేదు.

ఇటు చూస్తే భర్త వౌనంతో బాధిస్తున్నాడు. అటుచూస్తే తను సరదాగా నలుగురితో కలవలేక పోతోంది. అసలు ఎందుకొచ్చిందిక్కడకు? రాకపోయినా ఎంతో బాగుండి పోనుగదా అనుకోసాగింది పదే పదే.

బావా-మరదలూ

తను కాలేజీ చదువులు చదివింది. బావ అందరికంటే పెద్ద చదువులు చదివిన పెద్ద ఆఫీసర్ని తెచ్చి పెళ్లి చేశాడు తండ్రి. అందరికంటే తనే ఎక్కువ అదృష్టవంతురాలంటారంతా. కాని అది?...నిజానికి తనకంటే ఎన్నోరెట్లు ఏదృష్టవంతులు నీరజక్క, జలజక్కాను.

ఇలాంటి కోపతాపాలు, అలకలు, బ్రతిమాలు కోడాలు వాళ్ల జీవితాలలోనే లేవు. ఆయనకంటే బాగా తక్కువ చదివినా బావలు ఎంత సహృదయులు? వాళ్ల సంస్కారముందు యీయన సంస్కారం ఎంత అల్పంగా కనిపిస్తోంది?

నలుగురూ సరదాగా చేసుకుందామనుకున్న ఈ పండుగ ఎంతభారంగా గడుస్తోంది?

వాళ్ల మామయ్యగారింటికి పెళ్లికి వెళ్లింది మొన్న. అక్కడ తనిలాగే సంకుచితంగా ప్రవర్తించిందా? వాళ్లందరిలో ఎంత యిదిగా కలసిపోయింది?

వాళ్ల వాళ్లతో నవ్వుతూ తుళ్లుతూ తిరిగిన పెద్దమనిషి, అక్కడ కొచ్చింది లగాయితు శిక్షను భవిస్తున్నట్టుగా కూర్చున్నారు నలుగురితో సరదాగా కబుర్లు చెప్పడంగాని ఏమీలేదు. ఎవరైనా వెళ్లి మాట్లాడించినా తూచినట్టు రెండుమాటలు మాట్లాడుతున్నారంతే

ఆయన తీరుచూసి, 'ఎప్పుడూ అతనిలాగే ఉంటాడేమిటి? ఎలా చేస్తున్నానే బాబూ అతనితో కాపరం' అనేశాడు అన్నయ్య.

సరిగ్గా తిండి అదీ తినకపోవడంచూసి అమ్మ అడిగింది.

'ఎందుకే అతనదోలా ఉంటున్నాడు. పండుగ బహుమానాల కోసమా? ఏం కావాలో కనుక్కో, మా శక్తికి మించనిదైతే యివ్వగలం గాని, శక్తికి మించినది ఎక్కడ్నించి తేగలం చెప్పు. నీకూ తెలుసుగా మన స్థితిగతులు' అంది అమ్మ.

తను సుఖంగా కాపరం చేసుకుంటోందనీ, ఏమీ కష్టపడడం లేదనీ, భర్త ఎంతో యిష్టంగా చూసుకుంటాడనీ అందరూ అనుకోవాలనీ, తల్లిదండ్రులు ఎంతో తృప్తిపడాలని ఆశించింది. కాని తన ప్రవర్తనతో అంతా తారుమారు చేశాడు భర్త.

తన నిక్కడ యింత యిరుకున పడేసినలగొట్టి, హృదయాన్ని తూట్లుచేసి, రేపు తమింట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఎంత ఆప్యాయం చూపిస్తేనేం? ఎంత అనురాగం కురిపిస్తేనేం? ఎవరికావాలి? హృదయంలో ఒకమూల ఈ నాటి ఈ ప్రవర్తన, ముల్లులా కలుక్కు కలుక్కుమంటూంటే, ఆ ఆప్యాయానురాగాల్ని మనస్ఫూర్తిగా స్వీకరించగలదా? పరిపూర్ణ హృదయంతో తననుతాను, అతనికి అర్పించుకోగలదా?

తల్లిదండ్రుల తృప్తికోసం,—పండుగ పూట వాళ్ల మనస్సులను కోటబ పెట్టకూడదన్న ఉద్దేశంతో, లేని ఉత్సాహం తెచ్చిపెట్టుకుని, దిగులుతో కృంగిపోతోన్న మనస్సుని మాటిమాటికి సమాధాన పరుచుకుంటూ, క్రొత్తబట్టలు కట్టుకుంది వాసంతి.

క్రొత్తచీరలో, నూతన శోభ నలరించుకుని, క్రొత్త అందాలు చిందిస్తోన్న వాసంతిని చూస్తోన్న కొద్దీ, దగ్గరకు తీసుకోవాలన్న కోర్కెకంటే, అర్థం లేని చికాకు ఎక్కువైపోయింది ప్రభాకరానికి. ఈ వాసంతి నాది, ఈ అందమంతా నా సొత్తు, అందులో మరెవరికీ పాలులేదు అని అతని మనస్సు ఘోషిస్తూంటే, అంతరాంతరాల్లోంచి ఎవరో, 'కాదు, కాదు. ఈ వాసంతి నాది కావొచ్చు గాని, ఆమె మనస్సంతా వాళ్ల బావలచుట్టూ ఉంది. ఆ క్రొత్తబట్టలు, ఆ పండుగ ముస్తాబు నాకోసంకాదు, వాళ్ల బావల కోసం అంటూ అరుస్తోన్నట్టు అనిపించసాగింది. తెలియని కోపంతో అతని మనస్సంతా గజిబిజయి పోయింది.

ఈ వాసంతికి తనంటే ప్రేమలేదా? తనకంటే వాళ్ల బావలే ఎక్కువా?—తన బాధ అర్థం చేసుకోదేం? తనను దగ్గరకు దీసుకుని, మీ దంతా వట్టి అపోహ. మీరే నా సర్వస్వం అని చెప్తే ఎంత బాగుంటుంది.

తనను లెక్కపెట్టకుండా ఎంత నిర్లక్ష్యంగా తిరుగుతోంది? వాళ్లక్కలూ బావలూతోటే ఎంత కులాసాగా కబుర్లు చెప్తోంది? క్రొత్తచీర కట్టుకుని ఫోజులు

కొడుతూ వాళ్ల బావలముందు అలా తిరుగుతోందిగాని, కట్టుకున్న భర్త క్షోభతో యిలా అలమటించి పోతుంటే చీమ కుట్టినట్టయినా లేదేం? తన కోపానికి, విసురుకి జడిసి, కొంచెం దిగులుగా ఉందంతె, 'నన్నెందుకిలా దూరం చేస్తున్నారు? అంటూ ఒక్కసారి తన హృదయంలో తలదూర్చి ఏడిస్తే తనకెంత తృప్తిగా ఉండును?' ఒంటికి కారం రాసుకున్నట్టు అవసంపడుతున్నాడు ప్రభాకరం.

'ఛ ఛ బుద్ధితక్కువై వచ్చానిక్కడికి జన్మలోరాకూడదింక' అనుకున్నాడు ఎన్నోసార్లు. ఆ విసుగుతోటే ఆకలిలేదని, పిండివంటలన్నీ తీసేసినమనిషి వెంటనే కాఫీ కావాలనేసరికి వాసంతి విసుపోయింది.

కాఫీచేసి, కిస్సుతో వస్తూంటే, 'వాసంతి పక్కా గృహిణయిపోయింది,' అన్నారెవరో ప్రక్కగదిలోంచి.

'అబ్బ ఎంత ఓపిక. ఇదివరకటి రోజుల్లో గ్లాసుతో మంచినీళ్లు తెచ్చిపెట్టమన్నా మాటవినేదికాదు బద్ధకమంతా ఏమైపోయిందో?' — అవతలి గదిలోంచి వినిపిస్తోన్నమాటలు వినినట్టు తలొంచుకు లోపల కూచ్చేసింది.

సన్నగా రేడియోపెట్టుకు, పేపరు తిరగేస్తూ, వగాసంగా కూర్చునున్నాడు ప్రభాకరం. అతన్ని కదిపితే ఎక్కడ కరవ్వొస్తాడో, మాట్లాడిస్తే, ఏం మాటలు విసురుతాడో నన్న భయంతో దిగులుగా కూర్చుంది వాసంతి.

గంటలు దొర్లిపోతున్నాయి. అతను మాట్లాడడు — అక్కడ్నించి కదలడానికి తనకులేదు. శిక్షనుభవిస్తున్నట్టు ఉలుకూ పలుకూ లేకుండా ఎదురుగా అలా కూర్చోవల్సిందే

అంతర్గతం రోజు శేఖరం బావ అంటున్నాడు. — 'ఎలాగా పెళ్లయాక వాసంతి బాగా మారిపోయింది గదా ఏరజా! ఇదివరకటిలా ఆ ఆప్యాయత, దనువుగా తిరగడం, అన్నీ తగ్గించేసింది. కీవిగా, బెట్టుగా కూర్చుంటోంది. పలకరించినా తూచినట్టు సమాధానా లిస్తోందంతే. ఎలాగైనా పెద్దాఫీసరు పెళ్లం గదా. మనమెంత వాళ్లముందు?'

'ఛ అదేంలేదు. పెళ్లయాక కొంత విలిపితనం పోయిందంతే. ఎల్లకాలం ఒకలా ఉండరుగదా. దానిముఖం, దానికి గర్వమేమిటి?' అంటూ తేల్చేసింది నీరజక్కయ్య.

ఎందుకో ప్రక్కగదిలోకి వెళ్లిన వాసంతికి, ఆమాటలు వినిపించేసరికి భోరున ఏడవాలని పించింది.

సాయంత్రం ముఖం కడుక్కుని వస్తూంటే, భాస్కరంబావ అంటున్నాడు. 'ఏమోయ్! జలజా! మీ చెల్లెలు నల్లపూసయి పోయిందేమిటి? శ్రీవాంచ్చాక మిగతా ప్రపంచం కనిపిస్తున్నట్టులేదే' అని.

'గది వదలకుండా ఎంతసేపుంటావు గాని, యిలా వచ్చికూర్చో కొంచెంసేపు' అంటూ పిలిచాడు శేఖరంబావ.

బావగారి పిలుపుతో తప్పనిసరయి వచ్చి కూర్చుంది.

'అసునే వసంతా నువ్వుమాస్తే మళ్లీ రేపు వెళ్లిపోతున్నావు. మళ్లీ ఎన్నాళ్ళకో గాని చూడ్డం పడదని, మీ బావను పోరి నేను తీసుకొస్తే నువ్వు క్షణమైనా మాతో మాట్లాడకపోతే ఎలా? రేపట్నుంచి ఎలాగా, నిన్ను మీ శ్రీవారూ. మీ శ్రీవారిని నువ్వూ చూసుకోవల్సిందే గదా ఈ ఒక్క రోజుకి మాదగ్గర కూర్చో'

ఏడవలేక నవ్వుతూ కూర్చుంది వాసంతి. ఆ కబుర్లు యీ కబుర్లు అందరూ తెగ చెప్పేస్తున్నారు. లోపల, గుండెలు పీచు పీచుమంటున్నా, బాగుండదని మధ్య మధ్య సంభాషణల్లో పాల్గొంటోంది వాసంతి.

బావ, తను బాగా చిన్నపిల్లప్పుడు చేసిన అల్లరేదో చెప్తున్నాడు. అందరూ నవ్వుతూంటె తనకూ నవ్వొచ్చేసింది.

ప్రక్కగదిలో ఒకసారిగా కుర్చీలు బల్లలు దబదబలాడేయి. వాసంతిగుండెల్లో వేయిపిడుగులు పడ్డట్టయింది.

'మీవారు సిగ్నలు యిచ్చినట్టున్నారు. వెళ్లు తల్లీ' అంది అక్కయ్య.

లోపల భయంగా వున్నా, వెంటనే లేస్తే అందరూ నవ్వుతారని కొంచెంసేపు అలాగే వుండిపోయి అప్పుడు లేచివెళ్లింది వాసంతి.

'అప్పుడే వచ్చేశావేం? మళ్లీ పాపం! ఎన్నాళ్లకోగాని కలుసుకోవు — వెళ్లి అక్కడే కూర్చోలేక పోయావా?' అన్నాడు వెటకారంగా ప్రభాకరం.

అతని మాటలకు వెంటనే సమాధానం చెప్పలేకపోయింది వాసంతి

'అక్కా వాళ్లూ ఏవో వేళాకోళాలాడుతూంటే వదిలి వస్తే బాగుండదని కూర్చుండిపోయాను' అంది నెమ్మదిగా.

'వేళాకోళాలకి చంటిపిల్లవా యేం? అంత మోజు తీరకపోతే, ఆ బావలింటికే

వెళ్ళు పోనీ.'

అసహ్యంతో నిలువెల్లా కంపించింది వాసంతి.

పూజ్యనీయులు, తండ్రిలాంటి వారూ అయిన బావల గురించి ఎంత హేయంగా మాట్లాడుతున్నాడు! తనను చూడగానే, 'రా అమ్మా! కూర్చో' అంటూ ఆప్యాయంగా పలకరించే బావలను ఎంత నీచంగా అంచనా వేశాడు!

బాధ, కోపం అనుమానాలతో వాసంతి అతకుతలాడి పోయింది. 'మీ దేమయినా కుంటే పడతానుగానీ, మా బావల గురించి అన్యాయం మాటలంటే పడను. వాళ్ళు నాకు తండ్రి తర్వాత తండ్రి అంతటి వారు.'

'ఎక్కడా మొగుడు లేకపోతే అక్కమొగుడే గతన్నారు పెద్దలూనాడే. అలాంటిది వేళ మవ్వు బయల్దేరి బావ తండ్రితో సమానమని బుజాపు చేద్దుగాని.

అయినా మీ యిళ్ళలో యిలా జరుగుతాయేమో గాని, మా యిళ్ళలో బావగారి యెదుటకు మరదలు రాదు. వాళ్ళకు కనిపించదు.'

'అలాగా—అయితే మీ యిళ్ళలో బావగారికి మరదలు కనిపించక పోవచ్చు గాని, వయసొచ్చిన మరదలు బావగారికి ఉత్తరాలు వ్రాయొచ్చనుకుంటా???

మీరన్నట్టు, ఆలస్యంగా పెళ్ళి చేసుకొన్న మగవాడికి, వయస్సులో ఉన్న మరదలు కనిపిస్తే ఆకర్షణ కావొచ్చు. కాని ఊహ వచ్చీ రాకముందే, యింట్లో బావగారిలా అడుగు పెట్టిన వ్యక్తి చుట్టూ, బావా? బావా? అంటూ పసితనం నుంచి కాళ్ళా వేళ్ళా తిరిగిన మరదలికీ, ఆ మరదలికీ వ్యత్యాసం లేదా?'

'ఏమో? నువ్వెన్ని చెప్పు — నువ్వలా వాళ్ళతో నవ్వుతూ తళ్ళుతూ మాట్లాడడం నా కిష్టముండదు. సంస్కారంలేని మనిషి ననుకో. సభ్యత తెలీకుండా మాట్లాడుతున్నా ననుకో. తర్వాత నీ యిష్టం'—అదే అతని అసలు ఉద్రేకం, నిజ స్వరూపమూను.

* * *

మంచంమీద కూర్చుని, అప్పుడే వచ్చిన మల్లెలూ, కనకాంబరాలూ మాలకడ్తోంది వాసంతి, ప్రభాకరం ఆఫీసు నుంచి తిరిగి వచ్చేశాడు.

'నీ కిష్టమైన బావగారు వేంచేస్తున్నారట. ఇప్పట్నుంచీ గులాబ్‌జాం చేసి రెడీగా పెట్టుకో' అంటూ మంచం మీద గిరాటేశాడు.

ఎకసక్కెంగా అంటూ, గులాబ్ జాం దగ్గర 'ఒత్తి పలికిన భర్త మాటలకు వాసంతి నిర్లిప్తంగా ఉండిపోయింది.

అన్నాళ్ళకు తనింటికి బావ వస్తున్నాడన్న ఆనందంకంటె దిగులు భయం అధికం అయ్యాయి ఆమెకి.

'అర్జంటుగా ఏదో పని తగిలి యిటు వైపుల కొస్తున్నాడట అతను. ఇంతకాలానికైనా వాసంతి కాపురం చూసే అవకాశం కల్గినందుకు ఎంతో సంతోషంగా ఉందని మరదలి నలభీమ పాకాలు త్వరలో వచ్చి రుచి చూస్తాననీ, ముఖ్యంగా తనొచ్చేసరికి గులాబ్‌జాం రెడీగా వుంచమనీ ఉత్తరం వ్రాశాడతను

పెళ్ళయిన క్రొత్తలో ఒకసారి ఏవో మాటల మధ్య భర్తతో అంది వాసంతి— 'మా బావకు గులాబ్ జాం ఎంతో యిష్టమని, ఒకసారి అతనొచ్చినప్పుడు, పుస్తకంలో చదివి, ట్రైచేసి చూసేను ఎంతో బాగా కుదిరింది. అప్పట్నుంచి నవ్వుతూ అరటూంటాడు—మీ యింటికొచ్చినప్పుడు గులాబ్‌జాం చేసిపెట్టు అని' అంది.

ఆ మాటలింకా ఎక్కడ జ్ఞాపకం ఉన్నాయో అతనికి, యిప్పుడు నొక్కి పలుకుతున్నాడు.

'మొన్న యింటికి వెళ్ళినప్పుడు నీచేతి గులాబ్‌జాం తిని చాలా రోజులయిందన్నాడు బావ.

'ఇక్కడ చేయాలంటే నాకు బద్ధకం బాబూ! అమ్మదగ్గరకి రెస్టుకోసం వచ్చాను. అంతగా కావాలంటే మా యింటికొచ్చినప్పుడు కావల్సినవి వండి పెడతాలే' అన్నాను. అందుకు సరదాకి యిలా వ్రాశాడనుకుంటా' అంది సంజాయిషీ యిస్తోన్నట్టుగా.

'నీ యిష్టమైన బావగారు వస్తోంటే, మధ్య పానకంలో పుడకలా నేనెందుకు అడ్డు. నేను ఏ కేంపో వెళ్ళిపోతాను మీరు సరదాగా ఎంజాయ్ చేసుకోవచ్చు' అన్నాడోసారి.

వాళ్ళ బావల విషయంలో అనుమానం, పాధింపులు ఎప్పుడూ ఉన్నవే. తన ఉద్దేశ్యం కూడ ఏ వాడో సూటిగా తెలియచెప్పేశాడు గనుక, యింక ఏం అనడానికి వెనుదీయడంలేదు ప్రభాకరం.

అతనికీ జడిసే, గులాబ్‌జాం వండాలని మనస్ఫూర్తిగా ఉన్నా తయారుచేయడం మానేసింది వాసంతి.

ఆవేళ కొంచెం మంచిచీర కట్టుకుంది. 'ఏమిటి విశేషం. ముస్తాబయావు' అన్నాడు ప్రభాకరం. 'ఓహో తమరి బావగారు వస్తున్నారుకదూ. మర్చే పోయాను' అన్నాడు ఆ వెంటనే.

'ఏమిటో ఆ ఎత్తిపొడుపులు. రోజూ ముస్తాబవడం లేదా? రోజూ బట్టలు కట్టుకోవడం లేదా? ఏ వెలిసిన చీరో కట్టుకున్నా ప్రభాకరం పెళ్ళామనే అంటారుగాని, ఆ తలవంపులు ఎక్కడో ఉన్న అమ్మకూ నాన్నగార్కి రావుగదా?' అని బాధపడింది వాసంతి.

వాళ్ళ బావ రాగానే, ముభావంగా ఏవో రెండు మాటలు మాట్లాడి, అర్జంటు మీటింగేదో ఉందని, తీరుబడిగా బావా మరదళ్ళు మాట్లాడుకోండంటూ వెళ్ళిపోయాడతను. అమాయకంగా నవ్వుతూ ఉన్న బావకేం తెలుసు—హృదయాన్ని కోసే ఆ మాటల అర్థం.

అడుగడుగునా యివే మాటలు. నిలబడ్డానికి, కూర్చోడానికీ కూడ బెదురుగానే ఉంది. బావతో మనసారా మాట్లాడాలన్నా భయమే.

ఆ సాయంత్రం భోంచేస్తూ, 'ఏకంగా యిన్ని చేసేశావేమిటి? ఎందుకూ వేస్టు పొడుపో అని దేశమంతా గగ్గోలుగా ఉంటే —' అన్నాడు నవ్వుతూ. వాసంతి ఖిన్నురాలయి పోయింది. వాళ్ళ బావా చిన్నబుచ్చుకున్నాడు.

భర్త ఆఫీసుకి వెళ్ళిపోయాక కూడ, అతను దగ్గరలేకపోయినా, అతని మాటల ప్రభావంవల్ల మనసారా వాళ్ళ బావతో మాట్లాడలేకపోతోంది వాసంతి.

బావతో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, బావా భర్తా కలిసి తనని ఉడికిస్తూంటే, ఒకరోజు సినిమాకని, మరో రోజు ఊరు చూడ్డానికని, అలా వెళ్ళుంటే ఎంత బాగుండిపోను.

భర్త మాటల ప్రభావంతో బావకు తను దూరమైపోయింది. బావంటే తన కెక్కడ అంతులేని అభిమానమోనన్న బెంగతో అతను తప్పుకు తిరుగుతున్నాడు మధ్య—ఎటూ అర్థంకాక సతమతమయ్యేది బావ' అనుకోసాగింది వాసంతి.

* * *

వాసంతి వాళ్లక్కు ఉత్తరం వ్రాసింది. ఆ ఉత్తరంలో నిష్ఠూరం ఎక్కువగా ధ్వనించింది.

'మీ బావగారు క్షేమంగా యిక్కడికి చేరారు. రాగానే పరుగుపరుగున ఎదురెళ్లి 'మా వాసంతి ఎలా ఉంది? వంట బాగా చేసేయగల్గుతోందా ? ఇల్లెలా చక్క బెట్టుకుంటోంది?వారం ఉంటానని వెళ్లి నాలుగురోజుల్లోనే వచ్చేశారేం అంటూ ప్రశ్నలవర్షం కురిపించాను.

'ఎంతైనా ఆయన పెద్దాఫీసరుగదూ? మనలాంటివాళ్లతో కులాసాగా గడపడానికి, వాళ్ల టైము వేస్టు చేయాల్సివస్తుందని, వచ్చేశానన్నారు.

ఆఖరికి గుచ్చిగుచ్చి అడగ్గా, 'వాసంతి పరాయిదైపోయింది భర్త ప్రభావం బాగా పనిచేస్తోంది. గదిపరకటేలా ఆటలు పట్టిస్తూ, విసిగిస్తూ, బావా! బావా! అంటూ చుట్టుచుట్టూ తిరిగే వాసంతి కాదు ఇప్పుడు బాగా మారిపోయింది' అన్నారు ఎంతో బాధగా.

మీ యింటిదగ్గర్నుంచి తిరిగొచ్చాక, చాలా రోజులదాకా బావ మామూలు మనిషి కాలేకపోయారు' అంటూ వ్రాసుకొచ్చింది.

ఇలా చదవడం ముగించిందో లేదో, ప్రభాకరం ఆఫీసునుంచి వచ్చేశాడు

ఉత్తరం చేతోపట్టుకుని, స్థాణువులా నిలబడున్న వాసంతినిచూసి, 'ఎక్కడ్నించా ఉత్తరం?' అంటూ తీసుకు చదివాడు.

'ఏడవలేక పోయారు. వెధవ ఈర్ష్య; మనల్ని చూసి. లేకపోతే అడ్డమైనవాళ్లూ వచ్చారని. చేతులు కట్టుకు వెంటబడి తిరుగుతాను' అంటూ విసురుగా గిరాటేశాడా ఉత్తరాన్ని.

'తన స్వంత బావ!

—శ్రీవారి దృష్టిలో అడ్డమైన వాళ్లూ అన్న లెక్కలోకి జమయ్యాడు!

ఆఫీసరని అహంకారమా ?

కాదు.

డబ్బుందని గర్వమా?

అంతకంటే కాదు.

తన క్రింద పనిచేసే చిన్న చిన్న ఉద్యోగులలో సైతం ఎంతో ఆదరంగా అతను మాట్లాడటం ఎన్నోసార్లు చూసింది.

డబ్బుందని గర్వంగా వుండేవాళ్లంటే అతనికి ఎంతో అసహ్యం — ఆ విషయం తనకు తెలుసు.

మరి...??? మరి? ఒకటే కారణం కనిపిస్తోంది.

బావా మరదళ్ల మధ్య వుండె అనుబంధం మాటల కతీతమైనది. ఏ కవీ వర్ణించలేనట్టిది. దానిని అర్థం చేసుకోగల శక్తి ఏ కొద్ది మందికో తప్ప అందరికీ ఉండదు.

అలాంటిది—మేడలో మూడు ముళ్లూ వేసి, తన సర్వస్వం చేసుకొన్న అమ్మాయిని ఎప్పుడో అప్పుడు, ఏనాడో ఒకనాడు, ఈ చెట్టంత మనిషితోటీ, 'మా బావ' అంటూ పరాయి పురుషుడి గురించి యిష్టంగా చెప్తే, ఏ మొగుడు — ఏ మగవాడు సహించగలడు ?

ఎవ్వరూ సహించలేరు.

నిజంగా సహించాడూ అంటే అతనో గొప్ప వ్యక్తే అనుకోవచ్చు

ఆ రాత్రి భర్త నిద్రపోయాక వాసంతి కలం, కాగితం తీసి అక్కగార్కి ఉత్తరం వ్రాయడాన్కి కూర్చుంది.

'నీ ఉత్తరం అందినది. నీకు, బావకూ నా మీదున్న ఆప్యాయానురాగాలకి, సరిపడ ఆదరాన్ని తిరిగి పొందలేదని నాకూతెలుసు. అందుకు క్షమించు.

నేనలా ప్రవర్తించడాన్కి కారణం మీ రనుకున్నట్టు అహంకారంకాదు. మా యిద్దరి ఆ ప్రవర్తనకు కారణం నేను ఒక బావగార్కి మరదలును కావడమే. అదే గొప్ప నేరమయిపోయింది శ్రీవారి దృష్టిలో.

సంసారంలో భార్యాభర్తల్లో ఒకరిమీద ఒకరికి నమ్మకం లేనప్పుడు ఆ సంసారం ఎలా ఉంటుందో వేరే రాయనవసరం లేదు.

ఆయన కిష్టంలేనప్పుడు, అందుకు వ్యతిరేకంగా ప్రవర్తించడం ఎందుకు? గృహాన్ని నరకం చేసుకోవడ మెందుకనే, నేను ఆయన కనుగుణంగా మారిపోయి నడుచుకున్నాను.

బావమనస్సు నొప్పిస్తున్నానని తెలుసుండీ, ఏమీ చేయలేకపోయిన నిర్భాగ్యురాలిని నన్నర్థం చేసుకోగల్గితే ధన్యురాలినే.'

ఉత్తరం అయితే వ్రాసిందిగావి, దాన్ని పోస్టుచేయలేక పోయింది వాసంతి.

ఇన్నాళ్లూ వాసంతి తన భర్తగురించి అందరూ ఎంతో విద్యావంతుడనీ, సంస్కారవంతుడనీ, చాలా తెలివైనవాడనీ చెప్పుకుంటూంటే మాత్రమేవింది.

అలాంటిదప్పుడు, అతని గురించి, ఎంతో సంకుచిత హృదయుడన్నా పట్టి అనుమానస్తుడనీ నలుగురూ అనుకుంటూంటే తను సహించలేదు.

అనుకుంటే అనుకోని, తనగురించి — అహంకారనీ, పెళ్లయాక మారిపోయిందనీని'—అనుకుని ఆ ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చింపేసింది వాసంతి.